సాక్షి చిత్తూరు

బుధవారం । 25 । డిసెంబర్ । 2024

ప్రేమ ప్రభువించెన్




విద్యుత్ దీపాలంకరణలో చిత్తూరులోని జాన్‌బాస్కో చర్చి

భక్తి రసమయ గీతాలు ఆలపిస్తూ బాల ఏసు జననానికి స్వాగతాంజలి పలుకుతూ చేసుకున్న క్రిస్మస్ సంబరాలు చిత్తూరు జిల్లాలో హోరెత్తుతున్నాయి. చర్చిలకు విద్యుత్ దీపాలంకరణలు..బాల ఏసు జనన వృత్తాంత బొమ్మల కొలువులు.. క్రీస్తు గీతాలతో నృత్యాలతో ఎటు చూసినా క్రిస్మస్ వేడుకలు మిన్నంటాయి. ఏసు ప్రభువు చూపిన దయ..మానవత్వం..ప్రేమ..అనురాగం.. అనే మార్గంలో వారు సాగిపోతున్నారు. శాంతాక్లజ్ వేషధారణలో చిన్నారులను నవిస్తూ.. ఏటా వారు దయామయుడి జన్మదినాన్ని జరుపుకుంటున్నారు. – చిత్తూరు రూరల్

న్యూస్‌రీల్

క్రిస్మస్ సుఖసంతోషాలతో జరుపుకోవాలి


మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి

పుంగనూరు: జిల్లాలోని క్రైస్తవులందరూ సుఖ సంతోషాలతో క్రిస్మస్ పండుగను జరుపుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆకాంక్షించారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి వేర్వేరుగా ఈ మేరకు ప్రకటనలు విడుదల చేశారు. క్రిస్మస్ పండుగను క్రైస్తవులు వారి కుటుంబ సభ్యులతో కలసి పండుగజరుపుకుని, ఆనందంగా ఉండాలని కోరారు.

రేపు పడిమెట్ల పూజోత్సవం


అయ్యప్ప ఆలయంలో పద్దెనిమిది మెట్లు

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోట మల్లై అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం పడిమెట్ల పూజోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు. ప్రతి ఏటా డిసెంబరు 26న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలోని పద్దెనిమిది మెట్లకు కేరళ సంప్రదాయ రీతిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ పూజను తిలకించేందుకు పలు ప్రాంతాల నుంచి అయ్యప్ప భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. ఈ నేపథ్యంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా వివిధ రకాల పుష్పాలతో అలంకరిస్తున్నారు.

28న మొగిలీశ్వరాలయ దుకాణాల వేలం

బంగారుపాళెం: మొగిలి శివాలయానికి సంబంధించిన వివిధ దుకాణాలకు ఈ నెల 28వ తేదీ లీజు వేలం నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజు, వంశ పారంపర్య ధర్మకర్త విజయకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు దేవదాయశాఖ అధికారుల సమక్షంలో వాహనాల పా ర్కింగ్, కొబ్బరి కాయలు, పూజాసామగ్రి విక్రయం, పాదరక్షలు భద్రపరడం, కొబ్బరి చిప్పలు, తలనీలాలు పోగు చేసుకునే హక్కుకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. తలనీలాలు పోగు చేసుకునే హక్కుకు సంబంధించి రూ.50 వేలు, ఇతర వేలం పాటల్లో పాల్గొ నడానికి రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. ఈ నెల 4వ తేదీన జరగాల్సిన వేలం వాయిదా పడిన విషయం తెలిసిందేనన్నారు. వివరాలకు కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

పన్ను పోటు తప్పదా.. సర్వేశ్వరా!

సంక్షేమం.. అభివృద్ధి అటకెక్కాయి. హామీలు గాల్లో కలిసిపోయాయి.. అయినా ప్రజలకు వడ్డనలు మాత్రం తప్పడం లేదు. ఇప్పటికే విద్యుత్ చార్జీలు.. భూ రిజిస్ట్రేషన్ల విలువ పెంపుతో భారం మోపిన కూటమి సర్కారు కొత్త సంవత్సరంలో పురవాసుల నెత్తిన పన్ను పిడుగు పడనుంది. ఇందుకు సంబంధించి సర్వే శరవేగంగా సాగుతోంది. దీంతో పన్ను పోటు తప్పదా సర్వేశ్వరా..! అనక తప్పదు.

జిల్లాలోని మున్సిపాలిటీల్లో వేగంగా సర్వే పనులు

- ఇప్పటికే 60 శాతం భవనాల వివరాల సేకరణ
- ఆస్తి పన్ను, నీటి పన్ను పేరిట సామాన్యులపై భారీ వడ్డన?
- కార్పొరేషన్లు.. మున్సిపాలిటీల్లోని ప్రజలపై బాదుడుకు సిద్ధం



చిత్తూరు అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తి అయ్యింది. ఇచ్చిన హామీ ఒకటీ నెరవేర్చలేదు. మరో వారంలో కొత్త ఏడాదిలోకి అడుగెడుతున్నాం. కొత్త సంవత్సరంలోనైనా సంక్షేమ పథకాలు సామాన్యులకు చేరేలా చూడాల్సిన ప్రభుత్వం.. ప్రజలపై భారీగా పన్నుల భారం మోపనుందా..? అందుకే సచివాలయ కార్యదర్శులతో జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో సర్వే చేయిస్తోందా..? అంటే.. అవుననే సమాధానాలు వస్తున్నాయి. ఇటీవల జరిగిన మున్సిపల్ కమిషనర్ల రాష్ట్రస్థాయి సమావేశంలో కొత్త ఆస్తి పన్నులు విధించడానికి పచ్చ జెండా ఊపేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలు వడ్డించారు. పెరిగిన భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు కొత్త ఏడాది నుంచి అమల్లోకి తీసుకురావడానికి సిద్ధం చేశారు. ఇది చాలదన్నట్టు.. పట్టణాలు, నగరాల్లో భవనాలపై ఆస్తి పన్ను పెంచడానికి సర్వే మొదలు పెట్టేశారు. ఇప్పటికే 60 శాతం సర్వేను సచివాలయ కార్యదర్శులు పూర్తి చేశారు. మిగిలిన సర్వేను ఆగమేఘాలపై పూర్తి చేసి, రియల్‌టైమ్ పద్ధతిలో కొత్త ఆస్తి పన్ను విధించడం, నీటి పన్నులను పెంచడం, వీలైతే యూజర్ చార్జీలు వసూలు చేయడానికి ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను అధికారులు తూ.చ. తప్పకుండా అమలు చేయడానికి సర్వం సిద్ధం చేస్తున్నారు. 2025 మార్చి తరువాత జిల్లాలోని ఓ కార్పొరేషన్‌తో పాటు నాలుగు మున్సిపాలిటీల్లో ఆస్తి, నీటి పన్నులు పెరగడం, వాటిని అమల్లోకి తీసుకురావడం ఖాయంగా కనిపిస్తోంది.

భారం మోయాల్సిందే..?

ప్రస్తుతం జిల్లాలోని ఓ కార్పొరేషన్, నాలుగు మున్సిపాలిటీలకు ఏటా రూ.50 కోట్లకు పైచిలుకు ఆస్తిపన్ను డిమాండ్ ఉంది. ప్రభుత్వం ప్రజలపై కొత్త ఏడాదిని పురస్కరించుకుని రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు అదనపు భారం మోపడానికి చూస్తోంది. అంటే రూ.వెయ్యి ఆస్తి పన్ను వచ్చే సగటు వ్యక్తిపై రూ.వంద పెంచే అవకాశం కనిపిస్తోంది. ఒకేసారి మొత్తంగా పెంచినట్లు ప్రజలకు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. 'ఓ వ్యక్తిని హత్య చేసినట్టు కాకుండా, స్లో పాయిజన్ ఇచ్చి క్రమంగా పడుకోబెట్టినట్లు..' అప్పటికే వస్తున్న పన్నుపై కొద్ది మొత్తం ఏటా పెంచుకుంటూ పోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఇకపై పన్నులు..

తాజాగా పట్టణాల్లో సచివాలయ సిబ్బంది ప్రతీ భవనం వద్దకు వెళ్లి, వాటి వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారు. భవనం ఫొటో, యజమాని ఫొటోను తీసుకుంటున్నారు. ఇది ఎందుకని అడిగితే తమకు కూడా తెలియదని సిబ్బంది సమాధానం చెబుతున్నారు. పైనుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం భవనాలను ఆన్‌లైన్ చేస్తున్నామని, యజమాని వివరాలు సేకరించి, ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నట్లు స్పష్టం చేస్తున్నారు. ఈ వివరాలన్నీ సేకరించిన తరువాత ఇప్పటివరకు వస్తున్న ఆస్తిపన్నుపై అదనంగా 10 – 20 శాతం ఏటా పెంచడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ విలువ పెరిగే అంశంతో సంబంధం లేకుండా, స్థానిక సంస్థలకు ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలనే లక్ష్యంతో ఆస్తిపన్ను సైతం పెంచుకోవాలని ప్రభుత్వ పెద్దలు ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కమిషనర్ల సదస్సులో స్పష్టం చేసినట్లు సమాచారం. దీనికి తోడు ప్రతీ ఇంటికీ మున్సిపాలిటీ తరఫున కొళాయి కనెక్షన్ తీసుకోవాలన్న తప్పనిసరి నిబంధనలను అమలు చేయనున్నారు. ఇప్పటి వరకు నెలకు రూ.వంద ఉన్న నీటి పన్నులను, త్వరలోనే రెట్టింపు చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఇప్పటి వరకు ఇలా..

జిల్లాలోని చిత్తూరు కార్పొరేషన్‌తో పాటు పలమనేరు, పుంగనూరు, కుప్పం, నగరి మునిసిపాలిటీలున్నాయి. వీటిల్లో 98 వేల వరకు భవనాలు ఉన్నాయి. వీటి ద్వారా ఏటా మున్సిపాలిటీలకు రూ.కోట్ల ఆదాయం ఒక్క ఆస్తి పన్ను రూపంలోనే సమకూరుతోంది. ఇప్పటి వరకు ఓ భవనానికి సంబంధించిన భూమి విలువ, భవనం ఖరీదును లెక్కకట్టి.. ఆ మొత్తంలో 0.15 శాతం ఆస్తిపన్ను విధిస్తున్నారు. ఇది గృహ సముదాయాలకు (నివాస భవనాలు) మాత్రమే. వాణిజ్య (కమర్షియల్) భవనాలకు 0.30 శాతం పన్ను విధిస్తున్నారు. అంటే ఓ భవనానికి సంబంధించిన భూమి, కట్టడం రెండింటి విలువ కలిపి రూ.50 లక్షలుంటే నివాసభవనాలైతే రూ.7,500, కమర్షియలైతే రూ.15 వేలు చొప్పున ఏటా ఆస్తిపన్ను వసూలు చేస్తున్నారు. ఏటా రిజిస్ట్రేషన్ శాఖ వద్ద ఉన్న భూముల వివరాల ఆధారంగా 10 – 20 శాతం రిజిస్ట్రేషన్ విలువ పెంచుతున్నారు. ఈ లెక్కన కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోని భవనాలకు పన్ను మదింపు మ్యాపింగ్ జరిగిపోతుంది. అంటే భూముల రిజిస్ట్రేషన్ విలువ పెరగ్గానే.. ఆటోమేటిక్‌గా ఆస్తిపన్ను కూడా పెరిగిపోతుంది.


పలమనేరు పట్టణంలో సర్వే చేస్తున్న సచివాలయ కార్యదర్శి


చిత్తూరు నగరంలో భవన వివరాలు ఆన్‌లైన్ చేస్తున్న కార్యదర్శి

27న ప్రజల పక్షాన పోరుబాట


పోరుబాట పోస్టర్ ఆవిష్కరిస్తున్న విజయానందరెడ్డి

- విద్యుత్ చార్జీల పెంపుపై ఆందోళన
- ట్రాన్స్‌కో డీఈ కార్యాలయం ఎదుట నిరసన
- పోస్టర్ ఆవిష్కరించిన విజయానందరెడ్డి
- ప్రజలపై రూ.15,484 కోట్లు భారం మోపిన కూటమి ప్రభుత్వం

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన ఈ నెల 27వ తేదీన పోరుబాట పట్టనుంది. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాల వద్ద పోరుబాట పేరుతో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. చిత్తూరులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి నాయకులతో కలిసి పోరుబాట పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవసరం తీరాక ఇచ్చిన మాటను మరిచిపోవడం చంద్రబాబుకు అలవాటుగా మారిందన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని బాబు చెప్పారన్నారు. అసలు పెంచబోమని కూడా చెప్పిన మాటలు అందరికీ గుర్తున్నాయన్నారు. ఎన్నికలు అయిపోయిన తర్వాత రాష్ట్ర ప్రజలపై పెనుభారాన్ని మోపుతున్నారని ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీలు, రిజిస్ట్రేషన్ ఫీజుతో పాటు వివిధ పన్నులు పెంచడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇంటికి పంపుతున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీల పెంపు రూపంలో రూ.15,484 కోట్లు భారం వేస్తున్నారన్నారు.

విజయవంతం చేయండి

ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ చేపడుతున్న పోరుబాట నిరసన కార్యక్రమానికి వినియోగదారులు పెద్దఎత్తున తరలివచ్చి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో నిరసన తెలియజేయడంతో పాటు అధికారులకు వినతిపత్రాలు అందించనున్నట్లు వెల్లడించారు. శుక్రవారం చిత్తూరు కట్టమంచి చెరువు సమీపంలోని వివేకానంద విగ్రహం వద్ద ర్యాలీని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు నియోజకవర్గ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వినియోగదారులు అక్కడికి చేరుకోవాలన్నారు. తర్వాత ప్లకార్డుల ప్రదర్శనతో ర్యాలీగా గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో డీఈ కార్యాలయానికి చేరుకుంటామని చెప్పారు. అక్కడ నిరసన వ్యక్తం చేసి, డీఈకి వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గాయత్రీదేవి, నాయకులు కృష్ణారెడ్డి, అంజలిరెడ్డి, మధుసూదన్ రాయల్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వ్యక్తులతో ఇసుక డిపోల నిర్వహణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఇసుక డిపోలు ప్రైవేట్ వ్యక్తులతో నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఇసుకరీచ్‌లు లేనందున చిన్నతరహా వినియోగదారుల సేవలకు ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో ఇసుక డిపోలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. చిత్తూరు, నగరి, పలమనేరులో ఇసుక నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సొంత రవాణా వాహనాలు, సొంత భూమి, లీజు భూమి ఒప్పంద పత్రాలు (కనీసం ఒక ఎకరం స్థలం) ఉండాలన్నారు. అర్హతలుండి, నిల్వ కేంద్రాలు ఏర్పాటు చేయాలనుకునే వారు వచ్చే జనవరి 4 తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు జిల్లా కేంద్రంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న జిల్లా గనులు, భూగర్భశాఖ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియకు ప్రీ బిడ్డింగ్ ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. ఇతర వివరాలకు 7013886327 నంబర్‌లో సంప్రదించాలని కలెక్టర్ వెల్లడించారు.

డిజిటల్ లావాదేవీల్లో జాగ్రత్తలు ముఖ్యం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజలు డిజిటల్ లావాదేవీలపై కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలని ట్రైనీ కలెక్టర్ హిమవంశీ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. పాల్గొన్న ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారులు మోసపూరిత ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వివిధ మాధ్యమాల్లో వచ్చే వ్యాపార ప్రకటనలను చూసి మోసపోకూడదన్నారు. వినియోగదారుల సంక్షేమం కోసం 24 డిసెంబర్ 1986లో మొట్టమొదటి సారిగా వినియోగదారుల రక్షణ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఈ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. వినియోగదారులు ఈ– కామర్స్, డిజిటల్ వ్యాపారాలపై ఎక్కువ మక్కువ చూపుతున్నారని తెలిపారు. ఆన్‌లైన్ కొనుగోలులో గుర్తింపు పొందిన వెబ్‌సైట్‌లను వినియోగించడం మంచిదన్నారు. నగదు చెల్లింపు పేజీలు సురక్షితంగా ఉన్నాయా? లేదా అని పరిశీలించుకోవాలని తెలిపారు. ఉచిత బహుమతులు, డిస్కౌంట్ సేల్స్ వలలో పడకూడదని చెప్పారు. ఖరీదైన వస్తువులను ఆన్‌లైన్‌లో కొనే సమయంలో క్యాష్ ఆన్ డెలివేరి ఆప్షన్ ఎంచుకోవడం మంచిదన్నారు. అనవసరమైన లింకులు, అటాచ్‌మెంట్, యాప్‌లకు దూరంగా ఉండాలని తెలిపారు. స్కామర్ల నుంచి రక్షణ పొందేందుకు ప్రొటెక్టింగ్ సాఫ్ట్‌వేర్లను ఇన్‌స్టాల్ చేసుకోవాలని చెప్పారు. బ్యాంక్ ఖాతా వివరాలు, పిన్ నంబర్, సీవీవీ నంబర్, పాస్‌వర్డ్ లాంటి వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని తెలిపారు. ఏవైనా సమస్యలు ఎదురైతే జాతీయ వినియోగదారుల సహాయ కేంద్రం 14404, 1915 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. అనంతరం మేలుకొలుపు పుస్తకం ఆవిష్కరించారు. డీఎస్‌ఓ శంకరన్, వినియోగదారుల కమిషన్ సభ్యుడు సలీం, పీవీకేఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి పాల్గొన్నారు.


పుస్తకం ఆవిష్కరిస్తున్న ట్రైనీ కలెక్టర్ హిమవంశీ

ముగిసిన ఉద్యోగోన్నతులు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని కార్పొరేషన్, మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన ఉద్యోగోన్నతుల ప్రక్రియ ముగిసింది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిత్తూరు డీఈఓ కార్యాలయంలో ఉద్యోగోన్నతుల ప్రక్రియ నిర్వహించారు. సాయంత్రం కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టి రాత్రి 7 గంటలకు పూర్తి చేశారు. ఈ ప్రక్రియను డీఈఓ వరలక్ష్మి పర్యవేక్షించారు. ఈ ఉద్యోగోన్నతుల ప్రక్రియలో అర్హులైన ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ 4, గణితం 1, ఫిజిక్స్ 1, బయాలజీ 8, సోషల్ 10, తమిళ మీడియం సోషల్ 1, తెలుగు మీడియం గణితం 1, తెలుగు మీడియం ఫిజిక్స్ 1 పోస్టులకు ఉద్యోగోన్నతులు కల్పించారు. అనంతరం ఉద్యోగోన్నతులు పొందిన టీచర్లకు డీఈఓ వరలక్ష్మి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ రామ్‌కుమార్, సత్య, సీనియర్ అసిస్టెంట్‌లు మురళి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


డీఈఓ చేతుల మీదుగా ఉద్యోగోన్నతి నియామకపత్రం అందుకుంటున్న ఉపాధ్యాయిని

క్లుప్తంగా

రెవెన్యూ సదస్సుకు రైతులు కరువు



రంగాపురంలో గ్రామసభకు వచ్చిన ముగ్గురే రైతులు

పాలసముద్రం : ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారం కోసం ఆముదాల పంచాయతీ రంగాపురంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు కర్షకులు రాకపోవడంతో మొక్కుబడిగా గ్రామసభ జరిపించారు. తహసీల్దార్ అరుణకుమారి, ఏఆర్ఐ దేవి, సర్వేయర్ గణేష్ తదితరులు ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభ రైతులు లేక బోసిపోయింది. చివరికి మూడు అర్జీలు తీసుకుని సభ ముగించుకున్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

ప్రేమ, శాంతి మీ జీవితాల్లో నిండాలి



శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: క్రిస్మస్ పండుగను ఆనందంగా జరుపుకోవాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. ప్రేమ, శాంతి, ఆనందం ప్రజల జీవితాల్లో నిండాలని ప్రార్థిస్తున్నట్లు వెల్లడించారు. క్రిస్మస్ అంటే కేవలం గిఫ్ట్‌ల పంపిణీతోపాటు కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి గడిపే అమూల్య క్షణాలన్నారు. శాంతిని జీవితంలో అలవాటు చేసుకుని నలుగురిపై సేవభావంతో ఉండాలన్నారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి



మహేంద్ర మృతదేహం

శాంతిపురం: విద్యుత్ షాక్‌కు గురై విద్యార్థి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. గుండిశెట్టిపల్లి అంబేడ్కర్ కాలనీకి చెందిన సుబ్రమణ్యం కుమారుడు మహేంద్ర(17) శాంతిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం ఆడుకుంటూ విద్యుత్ సబ్‌స్టేషన్ వైపు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైన మహేంద్ర పడిపోవడం చూసిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆటోలో కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే తను మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

రెండు వర్గాలు మేమంటే మేము అని మేతభూమిని మేసేయాలనుకున్నాయి.. ఒక వర్గం తమదని చదును చేస్తే.. ఇంకో వర్గం తమదని తప్పుడు రికార్డులతో మొక్కలు నాటింది. గ్రామస్తులు, అధికారుల అప్రమత్తతతో ఆక్రమణకు అడ్డుకట్ట పడింది. మొక్కలు పీకేశారు. అయినా మళ్లీ ఎక్కడ అధికారం కాసోహమంటుందోనని అందరూ ఆందోళన చెందుతున్నారు. ఇదే జరిగితే కోర్టు మెట్లెక్కడం ఖాయమంటున్నారు స్థానికులు.

సాక్షి ఎఫెక్ట్..

మొక్కలు పీకేశారు!

- 24 ఎకరాల మేత భూమిపై పచ్చనేతల వివాదం
- ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు
- మొక్కలు తొలగించిన రెవెన్యూ సిబ్బంది
- మేతభూమి రికార్డులు, సర్వే నంబర్లు తారుమారు చేయాలని ప్రయత్నం
- కొనసాగుతున్న విచారణ



పీకేసిన మొక్కలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరు రూరల్ పరిధిలోని బండపల్లి రెవెన్యూ 194 వెంకటాపురం పరిధిలోని 24 ఎకరాల మేత భూమిని మేసేస్తున్నారు. నాలుగు రోజులకు క్రితం ఒక వర్గం భూమిని జేసీబీలతో చదును చేసింది. ఇదే అదునుగా భావించి మరో వర్గం పట్టాలు ఉన్నాయని చూపి, ఆ వర్గాన్ని తరిమికొట్టింది. మరుసటి రోజు (ఆదివారం) మామిడి మొక్కలు తీసుకొచ్చి చదును చేసినంత వరకు నాటింది. ఇంతలో చదును చేసిన వర్గం పోలీసుల



మేతభూమిగా గుర్తించి..ఇచ్చిన పట్టాలను తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు

చెంతకు చేరింది. దీంతో వివాదం కాస్త ముదిరింది. పోలీసులు ఇరువర్గాలకు సర్ది చెప్పి రెవెన్యూ అధికారుల వద్దకు రికార్డులు తీసుకెళ్లి ఈ భూమి ఎవరిదో తేల్చుకోమని చెప్పి వెళ్లిపోయారు. దీనిపై సాక్షి దిన పత్రికలో సోమవారం 'అధికారం అడ్డుపెట్టుకుని ఆక్రమణ' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించారు. గ్రామస్తులు సైతం దినపత్రికలో వచ్చిన కథనాన్ని ఆధారంగా చేసుకుని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆ 24 ఎకరాల భూమి మేతభూమి అనే దానికి పక్కాగా రికార్డులు సమర్పించారు.

మేత భూమి విలువ నేడు రూ.కోట్లు

గతంలో ఈ భూమిని పెద్దగా పట్టించుకునే వారు కాదు. అడవి మధ్యలో ఉందని ఆక్రమార్కుల కన్ను మొత్తం రోడ్డు పక్కన ఉండే భూములపైనే ఉండేది. ఎప్పుడైతే చిత్తూరు తచ్చూరు రోడ్డు ఆ వైపు మార్కింగ్ పడిందో.. అక్కడి భూములకు రెక్కలొచ్చాయి. అక్రమార్కులు ఆ భూములను కాజేయాలని గట్టిగా నిర్ణయించుకున్నారు. పట్టువదలకుండా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగారు. కాసుల వర్షం కురిపించారు. అడ్డంగా దోచుకోవాలని కంకణం కట్టుకున్నారు. ఇప్పుడు అక్కడి భూముల ధరలు రూ.కోట్లు పలుకుతోంది. ఎకరా సంపాదించుకున్న లక్షాధికారి అవొచ్చని, ఇప్పుడు కాకపోయినా మరో 5 ఏళ్ల తర్వాత రూ.కోట్లు సంపాదించుకోవచ్చనే ప్రయత్నంలో ఆక్రమార్కులు ఈ భూమిపై కన్నేశారని గ్రామస్తులు చెబుతున్నారు.

విచారణపై అనుమానాలు

పోలీసుల రంగ ప్రవేశంతో కూటమి నేతలు పట్టాలున్నాయని మండల రెవెన్యూ అధికారుల వద్దకు తీసుకెళ్లారు. అయితే ఆ పట్టాలు నిజమైనవా? కాదా..అని గ్రామస్తుల్లో అనుమానాలు పుట్టుకొస్తున్నాయి. ఓ వీఆర్‌ఏగా చెప్పుకుంటున్న ప్రైవేటు వ్యక్తి, అతని అనుచరులు కలిసి మండలంలో తప్పుడు పత్రాలు సృష్టిస్తున్నారన్న ఫిర్యాదులున్నాయి. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, సర్వేయర్, వీఆర్వో సంతకాలను ఫోర్జరీ చేస్తున్నారని, అచ్చు గుద్దినట్లు సంతకాలు పెట్టేస్తున్నారని కార్యాలయంలో కింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు తెలుసు. ఇక గతంలో పనిచేసిన సర్వేయర్లు, వీఆర్వోలకు కాసులు ఎర వేసి, పట్టాలు తీసుకున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. ఇందుకు ఒక్కొక్కరి రూ. 50వేల చొప్పున్న ముడుపులు ఇచ్చుకున్నారనే విమర్శలు భగ్గుమంటున్నాయి. ఈ రకంగా పట్టాలు చేసి ఉండవచ్చని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇక మేత భూమికి గుట్టపోరంబోకు సర్వే నంబర్లను అంటగట్టే ప్రయత్నంలో నిమగ్నమయ్యారని, ఇందుకు అధికారులు కూడా సహకరిస్తున్నారని గ్రామస్తుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ఇక కూటమి నేతల నుంచి సిఫార్సులు రావడంతో మండల అధికారులు కూడా తలొగ్గే పరిస్థితులున్నాయని వారు చెబుతున్నారు. ఇదే జరిగే మళ్లీ గతంలో ఇచ్చిన ఉత్తర్వులతో న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు గ్రామస్తులు సిద్ధంగా ఉన్నారు.

మొక్కలు తొలగించారు..

గ్రామస్తులు వేసిన అప్పీల్ మేరకు ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో ఏపీ ల్యాండ్ రెవెన్యూ కమిషనర్ మేత భూమిలో ఇచ్చిన పట్టాను తొలగిస్తూ 1994లో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుతో పాటు దినపత్రికలో వచ్చిన కథనం క్లిప్పింగ్‌ను జత చేసి కలెక్టర్‌కు సమర్పించారు. వెంటనే ఆ భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశాలిచ్చారు. నాటిన మొక్కలను తొలగించేలా చూశారు. సోమవారం రాత్రి సిబ్బంది నాటిన మొక్కలను పూర్తిగా పీకేశారు. సిబ్బంది ప్రస్తుతం అక్కడే కాపాలా కాస్తున్నారు.

తప్పు ఉంటే చర్యలు

ముగ్గురు వ్యక్తులు పట్టాలు తీసుకొచ్చారు. తర్వాత కలెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు కూడా పరిశీలనకు వచ్చింది. ఆర్ఐ, వీఆర్వోను విచారణకు పంపాం. పరిశీలిస్తున్నాం. గతంలో మేతభూమిగా గుర్తించి...ఇచ్చిన పట్టాలను తొలగించిన విషయాన్ని కూడా పరిగణలోకి తీసుకున్నాం. పరిశీలన ఆధారంగా కచ్చితంగా చర్యలు ఉంటాయి. ఎవరిని వదిలిపెట్టాం.

– లోకేశ్వరి, తహసీల్దార్, చిత్తూరు రూరల్

టమాట పంట వర్షానికే దెబ్బ తింది

– ఉద్యానవన శాఖ అధికారి సంతోషికుమారి

సాక్షి ఎఫెక్ట్..

రొంపిచెర్ల: గానుగచింత పంచాయతీ గొల్లపల్లెలో రైతు పెద్దబ్బ టమాట తోట వర్షానికి దెబ్బ తిందని ఉద్యానవన శాఖ అధికారి సంతోషికుమారి తెలిపారు. సోమవారం సాక్షి దిన పత్రికలో 'నకిలీ విత్తనాలతో మోసం' అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై స్పందించిన ఆమె టమాట తోటను పరిశీలించారు. రైతు నాటిన విత్తనం సాలార్ విత్తనమేనని నిర్ధారించారు. విత్తనంలో మోసం లేదన్నారు. అయితే తుపాను దెబ్బతో పంట దెబ్బతినిందన్నారు. నకిలీ విత్తనాలతో పంట సాగు చేస్తే పంట దిగుబడి పూర్తి రాదన్నారు. అయితే రైతు పెద్దబ్బ పొలంలో టమాట పంట దిగుబడి వచ్చిందన్నారు. మొక్కలు సరఫరాలో ఎలాంటి తప్పు జరగలేదన్నారు. రైతు పెద్దబ్బకు ఇచ్చిన సాలార్ టమాట నారును మరో ఆరుగురు రైతులు నాటుకోవడం జరిగిందన్నారు. వీరి పంటలను కూడా పరిశీలించామని తెలిపారు. ఎక్కడ పంట దెబ్బతినలేదన్నారు. రొంపిచెర్ల మండలంలో నర్సరీలకు లైసెన్స్‌లు ఇస్తున్నామని తెలిపారు. అయితే రెండు నర్సరీలు లైసెన్స్‌లు లేకుండా నడుస్తున్నాయని తెలిపారు. వీటికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. రొంపిచెర్ల టమాట పంట దెబ్బతినే అవకాశం ఉన్న రైతులు ఎకరాకు రూ.1750 చెల్లించి బీమా చేసుకోవాలన్నారు. పంట నష్టం జరిగితే ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం మంజూరు చేస్తామన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 18 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందికి రూ.1.80 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పు ఇచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు ఇటీవల వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 18 మందిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.80 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలు రేపు

చిత్తూరు కార్పొరేషన్: సీపీఐ శతాబ్ది ఉత్సవాలను గురువారం చిత్తూరులో నిర్వహించనున్నట్లు ఆపార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజన్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో సీపీఐ ఏర్పాటు అయ్యిందని, 2024 డిసెంబర్ 26 నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందన్నారు. చిత్తూరు జిల్లా వ్యాప్తంగా కార్యకర్తలు శతజయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. నాడు స్వాతంత్రపోరాటం కోసం ఉద్యమించిన విషయాన్ని గుర్తు చేశారు. డిసెంబర్ 26న జరిగే శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మణి, గోపీనాథ్, దాసరి చంద్ర, విజయ్ కుమార్, దామోదరం, విజయగౌరీ, రమాదేవి, జమీలాబి, కుమారి, కవిత, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులు కల్పించాలి

చిత్తూరు కలెక్టరేట్ : స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని ఏపీ స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరోత్తమ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టుల భర్తీకి ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆదేశాలిచ్చిందన్నారు. రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది నుంచి దరఖాస్తులను స్వీకరించాలని ఆదేశాలిచ్చారని తెలిపారు. దీంతో కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ స్థాయి బోధనేతర సిబ్బందికి 10శాతం ఉద్యోగోన్నతులు ఇవ్వనున్నారని చెప్పారు. బోధనేతర సిబ్బందితో జూనియర్ కాలేజీల్లో ఉన్న ఖాళీలు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. మిగతా 90శాతం ఖాళీలు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో భర్తీ చేస్తారన్నారు. ఇలా చేస్తే గతంలో సీనియర్ స్కూల్ అసిస్టెంట్ల కు ఇచ్చే 40శాతం జేఎల్ ఉద్యోగోన్నతులు నిలిచిపోతాయని చెప్పారు. 302 ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జేఎల్ ఉద్యోగోన్నతులు 40 శాతం ఉపాధ్యాయులకు కల్పించాలని డిమాండ్ చేశారు. అడ్డుగా ఉన్న 223 ప్రభుత్వ ఉత్తర్వులు రద్దు చేయాలని కోరారు.

27 న రాష్ట్ర వాలీబాల్ జట్ల ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్ : విజయవాడలోని ఇందిరా గాంధీ స్టేడియంలో ఈ నెల 27వ తేదీన రాష్ట్ర స్థాయి వాలీబాల్ జట్ల ఎంపికలు నిర్వహిస్తారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు చిత్తూరు జిల్లా నుంచి ఆసక్తి ఉన్న వాలీబాల్ క్రీడాకారులు పాల్గొనవచ్చని తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు ఆధార్, నివాస ధ్రువీకరణ పత్రం, 10 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంకు వెళ్లాలన్నారు. రాష్ట్ర జట్టులో ఎంపికయ్యే వారు జనవరి 7 నుంచి 13 వ తేదీ వరకు రాజస్థాన్‌లో నిర్వహించే జాతీయ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

నాటుబాంబు పేలి ఆవుకు తీవ్రగాయాలు



గాయపడిన ఆవు

రామకుప్పం: మండలంలోని సింగసముద్రం అటవీ సరిహద్దులో మంగళవారం నాటు బాంబు పేలి ఆవుకు తీవ్రగాయాలయ్యాయి. మేత మేయడానికి వెళ్లిన ఆవు నాటు బాంబును నమలడంతో గాయాలయ్యాయి. వన్యప్రాణుల వేట కోసం అమర్చిన నాటు బాంబు తినడంతో ఆవుకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

నాటు బాంబుల స్వాధీనం

గుడిపాల: ఏడు నాటు బాంబులు స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. గుడిపాల మండలంలోని రెట్టగుంట గ్రామానికి చెందిన వేలు(45) ఇంటి పైకప్పుపై దాచిన ఏడు నాటుబాంబులను స్వాధీనం చేసుకున్నామన్నారు. తమిళనాడులోని కాట్పాడి సమీపంలోని కరసమంగళంలో నల్లమందు కొని నాటు బాంబులు తయారుచేసి అటవీ జంతువులను వేటాడడం జరుగుతుందన్నారు. అతనిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

రుణాల మంజూరులో ఇబ్బందులు పెట్టకండి

– కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : రుణాల మంజూరులో ప్రజలను ఇబ్బందులు పెట్టవద్దని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీఎల్‌ఆర్‌సీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్ బ్యాంకులైన హెచ్‌డీఎఫ్‌సీ, కోటక్ మహేంద్ర, ఐసీఐసీ, ఇతర బ్యాంకులు పథకాల లక్ష్యాలను ఎందుకు పూర్తి చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా పెట్టుబడి సాయం, రుణాలు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ప్రతి బ్యాంకు కేటాయించిన లక్ష్యాలు చేరుకోవాలన్నారు. లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. 2024–25 వార్షిక రుణ ప్రణాళికలో ప్రాధాన్యత రంగాలకు సెప్టెంబర్ 30వ తేదీ వరకు రూ.6,699 కోట్ల రుణాలు లక్ష్యంగా నిర్దేశించగా రూ.7,654 కోట్లు పంపిణీ చేశారన్నారు. సెప్టెంబర్ 30 వరకు బ్యాంకుల ఆధ్వర్యంలో వ్యవసాయ రంగానికి రూ.5,488 కోట్లు లక్ష్యం కాగా రూ.6,284 కోట్లు పంపిణీ చేశామని తెలిపారు. రుణాలను సకాలంలో తిరిగి చెల్లించిన రైతులకు సబ్సిడీ అందించడం జరుగుతుందన్నారు. బ్యాంక్ లింకేజీ ద్వారా స్వయం సహాయక సంఘాలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో 6,390 గ్రూపులకు రూ.472 కోట్లు, పట్టణ ప్రాంతాల్లో 1,305 గ్రూపులకు రూ.214 కోట్లు పంపిణీ చేశామన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, ఎల్‌డీఎం హరీష్, నాబార్డ్ ఏజీఎం సునీల్, తదితర అధికారులు పాల్గొన్నారు.

జాబితా నాయకులే ఇస్తుంటే ఇక మేమెందుకు?



సమావేశంలో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ వంశీ

పలమనేరు: 'పాడిపశువుల పెంపకం వృద్ధికి పాడి రైతులకు బ్యాంకు రుణాలను అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాల్లో అర్హులైన లబ్ధిదారులను మేము ఎంపిక చేస్తున్నాం. ఆపై అధికార పార్టీ నేతల చెప్పిన జాబితా ఫైనల్ అవుతోంది. అలాంటప్పుడు ఈ ఎంపికల బాధ్యత మా కెందుకు సార్.' అని వెటర్నరీ వైద్యులు, సచివాలయాల వెటర్నరీ అసిస్టెంట్లు ట్రైనీ కలెక్టర్‌కు విన్నవించిన సంఘటన పలమనేరు ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల పరిధిలో చిన్న సన్నకారు రైతులకు పాడి ఆవుల పంపిణీ కార్యక్రమంపై బ్యాంకర్లు, అధికారులతో ట్రైనీ కలెక్టర్ వంశీ, వెటర్నరీ జేడీ ప్రభాకర్, ఏడీ సుజాత ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ ఓ ఆవు లేదా ఆవు లేని చిన్న రైతులను గుర్తించి వారికి బ్యాంకు ద్వారా రుణాలనందించి, పాడి ఆవులను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 30 సెంట్ల భూమికంటే తక్కువగా ఉండి అందులో పశుగ్రాసాన్ని పెంచే రైతులు, అసలు భూమి లేని రైతులు కౌలుకు భూమి తీసుకొన్న వారికి సైతం పాడి ఆవులను బ్యాంకు రుణాల ద్వారా అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన పలువురు లేచి తాము ఎంపిక చేసిన వారి పేర్లు జాబితాలో ఉండవు సార్ అన్నారు. ఎందుకంటే ఆయా పంచాయతీల్లో టీడీపీ లీడర్లు లబ్ధిదారులను ఎంపిక చేసి వారికే ఇవ్వాలని హుకుం జారీ చేస్తుంటే మళ్లీ మేమెందుకు లబ్ధిదారులను ఎంపిక చేయడం వృథా అని చెప్పారు. దీంతో ట్రైనీ కలెక్టర్ సైతం ఏమీ చెప్పలేకపోయారు. ఆపై ఆయన మాట్లాడుతూ మీరు లబ్ధిదారులను ఎంపిక చేయండి, వారికి లబ్ధి చేకూరేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంకు బ్రాంచి మేనేజర్లు, వెటర్నరీ అధికారులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక కన్నపేగును తుంచేశాడు!

- రూ.35 వేలు కిరాయి ఇచ్చి కొడుకుని హత్య చేయించిన తండ్రి
- ముగ్గురు అరెస్టు, ఒకరు పరారీ



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ శ్రీనివాసులు

పుంగనూరు: చెడు అలవాట్లకు బానిసై, రెండో పెళ్లి చేయాలని కన్న కుమారుడు తల్లిదండ్రులను వేధించడంతో ఆ వేధింపులు భరించలేక విసిగివేసారిపోయిన తండ్రి రూ.35 వేల రూపాయలు కిరాయి ఇచ్చి హంతకులతో కొడుకును దారుణంగా హత్య చేయించిన సంఘటన పుంగనూరులో వెలుగులోకి వచ్చింది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా మదనపల్లె రూరల్ మండలం మామిడిగుండ్లపల్లెకు చెందిన గంగులరెడ్డి కుమారుడు సోమశేఖర్‌రెడ్డి (36) ఈ నెల 20న పుంగనూరు–బోయకొండ అటవీప్రాంతంలో శవమై పడి ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. దీనిపై సీఐ శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని సందర్శించి, కేసు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో హత్యగా రుజువు కావడంతో పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్‌తో కలసి హత్య కేసుగా మార్పు చేశారు. విచారణలో హతుడు సోమశేఖర్‌రెడ్డి చెడు అలవాట్లకు బానిసైనట్లు తెలిపారు. పదేళ్ల కిందట వివాహం చేసుకున్న సోమశేఖర్‌రెడ్డి వేధింపులు తట్టుకోలేక భార్య, పిల్లలు ఆత్మహత్య చేసుకున్నారని, ఆ కేసులో సోమశేఖర్‌రెడ్డి నిందితుడని తెలిపారు. ఇలా ఉండగా రెండో పెళ్లి చేయాలని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను కొట్టడం, చంపేస్తామని బెదిరించేవాడని సీఐ తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో సోమశేఖర్‌రెడ్డిని హత్య చేయించాలని తండ్రి గంగుల్‌రెడ్డి నిర్ణయించుకుని పరిచయస్తులైన అమరనాథ్, రమేష్, మరొకరితో రూ.35 వేల రూపాయల కిరాయితో హత్యకు పథకం వేశారన్నారు. ఆ మేరకు కిరాయి హంతకులు సోమశేఖర్‌రెడ్డిని మదనపల్లె నుంచి తీసుకొచ్చి పుంగనూరు సరిహద్దుల్లోని అటవీప్రాంతంలో మద్యం తాపించి, అక్కడే అతడిని రాళ్లతో కొట్టి హత్యచేసినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు ముగ్గురు నిందితుల్లో తండ్రి గంగుల్‌రెడ్డి, అమరనాథ్, రమేష్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. మరొకరు పరారీలో ఉన్నారని , త్వరలో పట్టుకుంటామని సీఐ తెలిపారు.

నేను ఓటేశా.. నాకు తాగే హక్కుంది..

– ఎద్దులసంత వీధిలో మందుబాబు హల్ చల్



పలమనేరు ఎద్దులసంత రోడ్డుపై దర్జాగా పడుకున్న మందుబాబు

పలమనేరు: నేను ఓటేశాను, నాకు తాగే హక్కుంది.. మద్యం తాగాను, నన్నెవడ్రా ఆపేదంటూ పూటుగా మద్యం సేవించిన ఓ వ్యక్తి నడిరోడ్డుపై పడుకుని వాహనాలు వెళ్లనీయకుండా హల్‌చల్ చేసిన సంఘటన మంగళవారం పలమనేరు పట్టణంలోని ఎద్దుల సంత వీధిలో జరిగింది. రద్దీగా ఎక్కువ ఉండే ఆ మార్గంలో ఓ 50 ఏళ్ల వ్యక్తి నడిరోడ్డుపై పడుకున్నాడు. దీంతో కొందరు వాహనచోదకులు అతన్ని తప్పించి పక్కగా వెళ్లారు. వాహనాలకు అడ్డుకావడంతో కొందరు అతడిని లేవమని చెప్పగా నేను లేవను అంతానా ఇష్టం అంటూ మొండికేశాడు. దీంతో అక్కడున్న స్థానికులు అతి కష్టంపై అతన్ని పైకి లేపగా 'నేను ఓటేశాను తాగే హక్కునాకుంది, నీవు ఎవడ్రా నన్ను లేపేది.. నేనిక్కడే పడుకుండా ఎవరొస్తా చూద్దాం' అన్నాడు. దీంతో ఆగ్రహించిన స్థానికులు మందుబాబుకు బుద్ధి చెప్పి పక్కనపడేశారు. ఈ కారణంగా అక్కడ కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీన్ని గమనించిన స్థానికులు కూటమి మద్యం కిక్కు భలే ఉన్నట్టుందబ్బా సామీ అనుకోవడం వినిపించింది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి



ప్రమాదానికి గురైన కారు(ఇన్‌సెట్) మృతురాలు శాంతమ్మ

పుత్తూరు: మండలంలోని పరమేశ్వరమంగళం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. పరమేశ్వర మంగళం ఏఏడబ్ల్యూకు చెందిన కె.శాంతమ్మ(59) రోడ్డు దాటుతుండగా తిరుమల నుంచి చెన్నైకు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన శాంతమ్మను పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రమాదంలో కారు సైతం రోడ్డు పక్కనే ఉన్న కాలువలోనికి దూసుకుపోవడంతో అందులోని ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. వీరిని నగరి ప్రభుత్వాస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్‌షాపుపై పోలీసుల దాడి

– ఇద్దరు వ్యక్తుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ కొండకిందపల్లెలో బెల్ట్‌షాపుపై మంగళవారం వెదురుకుప్పం పోలీసులు దాడులు చేసి, అక్రమంగా మద్యం అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య కథనం మేరకు.. కొండకిందపల్లెలో పరదేశిరెడ్డి కుమారులు వై.నరసింహారెడ్డి, మల్లికార్జున బెల్ట్ దుకాణాన్ని నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో ఎస్ఐతో పాటు సిబ్బంది మంగళవారం గ్రామానికి వెళ్లి దుకాణంపై దాడులు చేశారు. ఈ దాడుల్లో కర్ణాటక మద్యంతో పాటు వివిధ రకాల బ్రాండ్లు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వారి వద్ద ఉన్న కింగ్‌ఫిషర్ బీర్లు 9, ఆంధ్ర మ్యాన్షన్ హౌస్ 6 బాటిళ్లు, మ్యాన్షన్ హౌస్ 3, ఇంపీరియల్ బ్లూ 5, నెపోలిన్ కొరియర్ 750 మిల్లీ లీటర్లు 3, నెపోలియన్ కొరియర్ 350 మిల్లీలీటర్లు 5, నెపోలియన్ కొరియర్ 180 మిలీ 15, బెంగళూరు బ్రాందీ 26 ప్యాకెట్లు, ఒరిజినల్ సైజ్ 25 ప్యాకెట్లు కాగా మొత్తం 37 బాటిళ్లతో పాటు 51 టెట్రా ప్యాకెట్లు సీజ్ చేసినట్లు తెలిపారు. విక్రేతలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.